క్లుప్తంగా

రెండు డైరెక్టర్లు ఏకగ్రీవం

ఉయ్యాలవాడ: మండలంలోని ఇంజేడు గ్రామంలో విజయ పాల డెయిరీ సొసైటీ డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు గురువారం విజయ డైరీ నిర్వహణాధికారి ఈశ్వరయ్య తెలిపారు. సొసైటీ పరిధిలోని రెండు డైరెక్టర్ల స్థానానికి గ్రామానికి చెందిన కామిరెడ్డి అమరనాథ్‌రెడ్డి, కామిరెడ్డి నారాయణరెడ్డి నామినేషన్లు వేశారన్నారు. కేవలం రెండు నామినేషన్లు మాత్రమే దాఖలు కావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

డంపింగ్ యార్డు పరిశీలన



చెత్త సేకరణను పరిశీలిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణం నుంచి భీమవరం వెళ్లే రహదారిలో ఉన్న డంపింగ్ యార్డును మున్సిపల్ ఏఈ, శానిటేషన్ సూపర్‌వైజర్, ఇన్‌స్పెక్టర్లతో కలిసి మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి గురువారం పరిశీలించారు. అలాగే వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. కార్మికులు పారిశుద్ధ్య నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ఆళ్లగడ్డ: రూరల్ మండలం బత్తలూరులో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ సరస్వతి తెలిపారు. గ్రామంలో అక్రమ మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఓ ఇంట్లో సోదాలు చేయగా అక్కడ 8 మద్య బాటిళ్లు లభించాయని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న రామచంద్రారావు

నంద్యాల(అర్బన్): గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రారావు తెలిపారు. మండలంలోని మిట్నాల గ్రామంలో తహసీల్దార్ ప్రియదర్శిని అధ్యక్షతన గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూసమస్యలు పరిష్కరించాలని ఐదుగురు రైతులు దరఖాస్తులు అందజేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నతిరుపతిరెడ్డి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి



అధికారులు, ప్రజా ప్రతినిధులతో జిల్లా పరిశీలకుడు వెంకటరత్నం

దొర్నిపాడు: గ్రామాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని జిల్లా అబ్జర్వర్ వెంకటరత్నం అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామాభివృద్ధిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, విధుల గురించి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులు, నిధుల వినియోగంపై సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సావిత్రి, ఈఓఆర్డీ సులోచన, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

ఆత్మకూరు: మండలంలోని సిద్దాపురం గ్రామ సమీపంలో మోటార్ సైకిల్‌పై నాటుసారాను తరలిస్తున్న మాణిక్యాల మహేష్, మాణిక్యాల ప్రతాప్‌లను అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎస్.కిషోర్‌కుమార్ గురువారం తెలిపారు. సదరు వ్యక్తుల నుంచి మోటార్ సైకిల్, 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. నాటుసారా తయారీ, అక్రమ మద్యం సరఫరా చేసే వారి వివరాలు తెలిస్తే తన సెల్ నం. 94409 02585, 91772 99067, 83283 07774 నంబర్లకు సమాచారం అందించాలన్నారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది బాదుల్లా, రామచంద్రుడు, కృష్ణుడు,తిక్కయ్య, రామకృష్ణుడు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

మహానంది: మహానంది నుంచి నంద్యాలకు వెళ్లే మార్గంలో గురువారం పెద్ద ప్రమాదం తప్పింది. గురువారం మహానంది నుంచి ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను అల్లీనగరం గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న మహారాష్ట్రకు చెందిన తుఫాను వాహనం టైరు పంక్చర్ అవ్వడంతో ఢీకొంది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ బాషా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. అదృష్టవశాత్తు ఆటోలో ఉన్నవారు, తుఫాన్ వాహనంలో ఉన్నవారు సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

మొక్కుబడిగా రెవెన్యూ సదస్సులు

- జనంలేక వెలవెలబోతున్న సదస్సులు
- అర్జీలు ఇవ్వడానికి కూడా రాని ప్రజలు
- రెవెన్యూ అధికారులు మాత్రమే హాజరు
- ఇతర శాఖల అధికారులు అటువైపు కన్నెత్తి చూడని వైనం
- అధికార పార్టీ నేతలతో అర్జీల స్వీకరణ



ఓబులంపల్లెలో వెలవెలబోతున్న సభా ప్రాంగణం



చిత్రేనిపల్లెలో కూటమి నేతలతో అర్జీ స్వీకరిస్తున్న డీటీ

ఆళ్లగడ్డ: రెవెన్యూ సదస్సులు నియోజకవర్గంలో తూతూమంత్రంగా సాగుతున్నాయి. కనీసం అర్జీలు అందించేందుకు కూడా రైతులు ఆసక్తి చూపడం లేదు. దీంతో చేసేది లేక రెవెన్యూ అధికారులు మాత్రం హాజరై మమ అనిపిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించాల్సి ఉండగా అనేక చోట్ల ఉదయం 11 గంటలకు మొదలుపెట్టి మధ్యాహ్నం వరకే నిర్వహిస్తున్నారు. భోజనం చేసిన తర్వాత సదస్సు మొక్కుబడిగా సాగుతోంది. రైతులు ఎవరూ రావడంలేదని అధికారులే కబర్లు చెప్పుకోవడం పరిపాటిగా మారింది. సంవత్సరాల తరబడి తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగితే పరిష్కరించని సమస్యలు ఇప్పుడు వినతి పత్రం ఇచ్చిన వెంటనే పరిష్కరిస్తారా అంటూ ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు.

అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే..

నియోజకవర్గంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు ప్రజల నుంచి స్పందన కరువైంది. అధికారుల సమన్వయ లోపంతో సదస్సులు ఉన్నాయని అవగాహన కల్పించడంలోనూ విఫలమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనేక మందికి ఉదయం అధికారులు వచ్చి సమావేశం ఏర్పాటు చేసేంతవరకు కూడా తెలియకపోవడం గమనార్హం. సదస్సులపై కేవలం అధికార పార్టీ నేతలకు మాత్రమే ముందస్తు సమాచారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నట్లు విమర్శల వెల్లువెత్తుతున్నాయి. అనేక చోట్ల అధికారుల స్థానంలో పచ్చ నేతలను కూర్చోబెట్టి సమావేశాలు నిర్వహిస్తుండడంతో ఇతరులు అక్కడికి వెళ్లడానికి సంశయిస్తున్నారు. మరికొన్ని చోట్ల ఎలాంటి అర్హత లేకపోయినా అధికార పార్టీ నేతల చేతులమీదుగా ధృవీకరణ పత్రాలు అందజేయడం పలు విమర్శలకు దారి తీస్తోంది.

> **స్థానిక ప్రజాప్రతినిధులకు దక్కని గౌరవం**
>
> ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని ఆదేశాలు జారీ చేసింది. కానీ ఈ విషయంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో 90 శాతంపైగా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులే ఉండడంతో వారికి ఎలాంటి సమాచారం ఇవ్వడంలేదు. అర్హత లేకపోయినా పచ్చ తమ్ముళ్ల ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించడంతో ప్రజలు సదస్సులకు హాజరు కాలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు సదస్సుల సమాచారాన్ని ముందుగా తెలియజేయడంతో పాటు తమను కూడా ఆహ్వానించాలని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

రెవెన్యూ అధికారులు మాత్రమే..

రెవెన్యూ సదస్సులు అంటే కేవలం భూ సమస్యలే కాదు. అనేక సమస్యలు అక్కడిక్కడే పరిష్కరించి అవసరమైన వారికి ధృవీకరణ పత్రాలు సైతం ఉచితంగా అందజేస్తామని.. ఇందుకు హౌసింగ్, పంచాయతీ, అటవీ, దేవదాయ, విద్య, సర్వే, రిజిస్ట్రేషన్, విద్యుత్, వైద్య ఆరోగ్య, వెలుగు, పౌర సరఫరాలు తదితర అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొంటారని ప్రభుత్వం ప్రకటించింది. అయితే క్షేత్ర స్థాయిలో ఎక్కడా ఈ అధికారులు కనిపించడం లేదు. కేవలం రెవెన్యూ శాఖ అధికారులు మాత్రమే సమావేశానికి హాజరవుతుండడంతో ఇతర శాఖలతో ముడిపడిన సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని జనం చర్చించుకుంటున్నారు.

బాల్యవివాహాలతో భవిష్యత్తు నాశనం

మహానంది: తల్లిదండ్రులు బాలికల భవిష్యత్తు పట్ల తగిన శ్రద్ధ చూపాలని, చిన్న వయసులోనే వారికి వివాహాలు చేసి వారి భవిష్యత్తును పాడు చేయవద్దని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లీలావతి తెలిపారు. తిమ్మాపురంలోని ఏపీ మోడల్ పాఠశాలలో కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీడీ లీలావతి మాట్లాడుతూ కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ పోషకాహారం తీసుకోవాలన్నారు. ఎవరైనా బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహమ్మద్ దౌలా, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి

నందికొట్కూరు: నూతన సచివాలయం, నూతన హెల్త్ కేంద్రం ప్రారంభోత్సవాలకు ఆహ్వానించకుండా ఎలా ప్రారంభిస్తారని గ్రామ సర్పంచు తలారి ఉమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామంలో సచివాలయం, హెల్త్ కేంద్రం ప్రారంభోత్సవానికి ప్రొటోకాల్ ప్రకారం సర్పంచ్‌ను పిలవకుండా ఎమ్మెల్యే జయసూర్య ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. సర్పంచ్ బీసీ మహిళ కావడంతో కనీసం ఆహ్వానం కూడా అధికారులు ఇవ్వకుండా కించపరిచారని మండిపడ్డారు. తనకు ఆహ్వానం అందించకుండా ఎమ్మెల్యేతో ప్రారంభోత్సవం చేయించిన సంబంధిత అధికారులపై జిల్లా కలెక్టర్, సంబంధించిన శాఖ మంత్రి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి



హరివరం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్



అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఉయ్యాలవాడ: భూ సమస్యలు పరిష్కరించేందుకు చేపట్టనున్న రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ శ్రీనివాసులు కోరారు. గురువారం మండలంలోని హరివరం గ్రామంలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ గ్రామంలో 1224 మంది రైతులకు సంబంధించి 6,750 ఎకరాల విస్తీర్ణంలో రీ సర్వే చేయాల్సి ఉందన్నారు. రెవెన్యూ అధికారులు భూముల విస్తీర్ణం కొలతలు వేసేందుకు వచ్చినప్పుడు క్షేత్రస్థాయిలో రైతుల సహకారం ఎంతో అవసరమన్నారు. భూముల విస్తీర్ణంలో తేడాలు, సర్వే నంబర్లలో మార్పులు ఏదైనా సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారులతో సమన్వయం పాటించి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్‌ఓ గోపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం: రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుభద్ర రైతులకు సూచించారు. గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి ఇది మంచి అవకాశం అన్నారు. అర్జీలను క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలిస్తామన్నారు. సర్పంచ్ మాధవీలత, డీటీ మాదవ్, మండల సర్వేయర్ నాగప్రసాద్, వీఆర్వో షమిమున్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 6 అర్జీలు

శిరివెళ్ల: యర్రగుంట్లలో గురువారం రెవెన్యూ సదస్సు జరిగింది. భూ కొలతలకు 3, రెవెన్యూ రికార్డుల కోసం మరో 3 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ పుష్పకుమారి తెలిపారు. అర్జీలను సమగ్రంగా విచారణ చేసి పరిష్కరిస్తామని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ కిషోర్ కుమార్, మండల సర్వేయర్ చిన్న మల్లయ్య, సర్పంచ్ అయ్యలూరి సుభహాన్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఘనంగా గీతా యజ్ఞం

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామం నాగసాయి ఆశ్రమంలో గురువారం రామానంద స్వామి ఆధ్వర్యంలో గీతా యజ్ఞం ఘనంగా నిర్వహించారు. మహారాష్ట్రకు చెందిన గురు సిద్దేశ్వర స్వామి ముఖ్య అతిథులుగా హాజరై అనుగ్రహ సంభాషణ చేశారు. కృష్ణం వందే జగద్గురుం అని ప్రజలు గ్రహించాలని గీతాచార్యుని భోదనలు గ్రహించాలని తెలిపారు. ఫలం ఆశించకుండా మంచి కర్మలు చేయాలని చెప్పారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపునకు కుట్ర



శెట్టివీడు గ్రామంలో సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం



డి.వనిపెంటలో సామాజిక తనిఖీ సమావేశంలో టీడీపీ నాయకులు

- తమకు అనుకూలంగా ఉండేవారిని నియమించేందుకే..
- ఒత్తిడి చేస్తున్న టీడీపీ నాయకులు
- సామాజిక తనిఖీలను వేదికగా చేసుకుంటున్న వైనం

చాగలమర్రి: ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించేందుకు అధికార పార్టీ నాయకులు కుట్రలు పన్నుతున్నారు. ఇందు కోసం అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. వీరి వేధింపులు తాళలేక ఇప్పటికే కొందరు రాజీనామా చేశారు. మిగిలిన వారిని కూడా తప్పించి తమకు అనుకూలంగా ఉండేవారిని నియమించుకోవాలని టీడీపీ నాయకులు సామాజిక తనిఖీ బహిరంగ సభలను వేదికగా మార్చుకుంటున్నారు. మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన జాతీయ ఉపాధి హామీ పనులపై 18వ విడత సామాజిక తనిఖీ నిర్వహించి, గ్రామ సభలను నిర్వహిస్తున్నారు. గురువారం డి.వనిపెంట, శెట్టివీడు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఎం.ఫైరోజా, ఆదినారాయణ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ గ్రామ సభలను నిర్వహించారు. నాలుగు రోజులుగా శెట్టివీడు పంచాయతీలో నిర్వహించిన 167 పనులకు సంబంధించి రూ.50,21,659 లక్షలు మంజూరు చేశారు. ఈ మొత్తాన్ని మస్టర్లు వేసి పని చేసిన ఉపాధిహామీ కూలీలకు చెల్లించారు. వివిధ పనులకు కలిపి రూ.50,21,659 లక్షలు ఖర్చు చేశారు. ఈ మొత్తాన్ని 18వ సామాజిక తనిఖీలో భాగంగా డీఆర్‌పీ ఈ.గురుస్వామి ఈ నెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు పనులను తనిఖీ చేశారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాల భవనంలో గ్రామ సభను ఏర్పాటు చేసి, తనిఖీ నివేదికను సర్పంచ్ వై.లక్ష్మీదేవి, ఫీల్డ్ అసిస్టెంట్ పుల్లయ్య, ఉపాధిహామీ కూలీల సమక్షంలో చదివి వినిపించారు. డి.వనిపెంట గ్రామంలో 69 పనులకు రూ.70 లక్షలు మంజూరైనట్లు డీఆర్‌పీ గోవర్ధన తెలిపారు. కాగా సామాజిక తనిఖీ సభలను అదునుగా చేసుకుని ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడానికి కేపీ తండా, పెద్దబోధనం గ్రామాల్లో గ్రామ సభలను వాయిదా వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు

శెట్టివీడు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలనే ఉద్దేశంతో గ్రామ సభకు హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆధారాల్లేని ఆరోపణలు చేసి సభలో వాగ్వివాదానికి దిగారు. గ్రామానికి చెందిన నల్లమల బేబిరాణి అదే గ్రామంలో వివాహం చేసుకుని ఆమె తల్లిదండ్రుల రేషన్‌కార్డు నుంచి వైదొలగి భర్త, కుమారునితో కొత్త కార్డును పొందింది. ఆ రేషన్‌కార్డు నంబరుపై ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డు పొంది కూలి పనులకు వెళుతోంది. మస్టర్ ప్రకారం ఆమె ఖాతాలో డబ్బులు జమ చేశామని ఫీల్డ్ అసిస్టెంట్ పుల్లయ్య అంటున్నాడు. అయితే ఆమెకు అక్రమంగా జాబ్ కార్డు ఇచ్చారని టీడీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. అలాగే మండలంలోని చాలా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. గోట్లూరు, మల్లెవేముల, చిన్నబోధనం గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా చేశారు.

పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ





సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ,సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు

రుద్రవరం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి అందరు సహకరించాలని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని 21 పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయా పంచాయతీల పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అలాగే పంచాయతీకి ఆదాయం వచ్చే వనరులను గుర్తించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులతో పాటు స్థానికంగా సమకూరిన నిధులను కలిపి బడ్జెట్‌గా రూపొందించుకుని పాధాన్యత పరంగా పనులు చేస్తూ గ్రామాలను అభివృద్ధి వైపు నడిపించాలని సూచించారు.

ప్రజలకు అన్ని రకాల సేవలు అందజేస్తాం

నందికొట్కూరు: ప్రజల ముంగిటకే పాలన అందించేందుకు నూతన సచివాలయం, హెల్త్ కేంద్రం ప్రారంభించడం జరిగిందని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. గురువారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో సచివాలయం, హెల్త్ కేంద్రం, వడ్డేమాన్ గ్రామంలో సచివాలయం ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు గ్రామంలోనే మెరుగైన సేవలు అందించేందుకు నూతన భవనాలను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, మల్యాల ఎంపీటీసీ యశోధ, వడ్డేమాన్ సర్పంచ్ రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

లాభసాటి గొర్రెల పెంపకంపై అవగాహన





మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాసులు, పాల్గొన్న అధికారులు, సభ్యులు

- నేషనల్ లైవ్ స్టాక్ కార్పొరేషన్ ద్వారా రూ.కోటి వరకు రుణాలు
- 50 శాతం వరకు సబ్సిడీ
- ఎన్‌సీడీసీ రుణాల రికవరీపై దృష్టి సారించండి
- జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ సూచనలు

కర్నూలు (అగ్రికల్చర్): గొర్రెల పెంపకాన్ని అభివృద్ధి చేసేందుకు నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ 50 శాతం సబ్సిడీతో రుణ సదుపాయం కల్పిస్తోందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఉమ్మడి కర్నూలు జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు రుణ సదుపాయం పొందే అవకాశం ఉందని చెప్పారు. గురువారం యూనియన్ కార్యవర్గ సమావేశం బహుళార్థ పశువైద్యశాల ప్రాంగణంలోని సమావేశ మందిరంలో జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొర్రెల పెంపకాన్ని లాభసాటిగా అభివృద్ధి చేసుకునేందుకు శాస్త్రీయ పద్ధతులు పాటించే విధంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) ద్వారా గొర్రెల పెంపకానికి పంపిణీ చేసిన రుణాల రికవరీపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రూ.1.50 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని, 20 మంది రుణం పొందినప్పటి నుంచి రూపాయి కూడా చెల్లించ లేదని పేర్కొన్నారు. రుణాలు రికవరీ అయితే ఎన్‌సీడీసీ రెండో విడత రుణాల పంపిణీ చేసేందుకు నిధులు ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు. గొర్రెల పెంపకందారుల అభ్యున్నతికి తగిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. గొర్రెల అభివృద్ధి విభాగం ఏడీ సుభాన్‌బాషా, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ శ్రీనివాసరెడ్డి, ప్యాపిలి గొర్రెల శిక్షణా కేంద్రం అధికారులు, యూనియన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పేదరికం లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ



మాట్లాడుతున్న ఎంపీపీ ఆర్థర్ సైమన్

ఉయ్యాలవాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా పేదరికం లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ ఉమామహేశ్వర రావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలాధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధనపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుద్ధ్యం, ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పొదుపు మహిళలు బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలు పొంది సొంత వ్యాపారాలు చేసి ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలతో స్నేహ పూర్వకంగా మెలుగుతూ వారికి కావాల్సిన సదుపాయాలు కల్పించాలని సూచించారు. సేవ చేసినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా సర్పంచ్‌ల శిక్షణకు కేవలం పుచ్చకాయలపల్లె, ఉయ్యాలవాడ గ్రామ సర్పంచ్‌లు మధుసూదనా దేవి, మేకల ఓబులేస్ మాత్రమే హాజరు కావడం గమనార్హం. ఈఓఆర్డీ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్‌క్రిష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీప్తి, ఎంపీహెచ్ఓ దస్తగిరి పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలి

గోస్పాడు: సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలని స్టేట్ అబ్జర్వర్ వెంకటరత్నం అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో గ్రామాల సర్పంచులు,మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ శిక్షణను ప్రారంభించగా.. వెంకటరత్నం మాట్లాడుతూ అధికారులు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులను కలుపుకొని ముందస్తు ప్రణాళికల ఆధారంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎంపీడీవో అమానుల్లా మాట్లాడుతూ మొత్తం 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో తొమ్మిదింటిపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ నాగఅనసూయ, ఎంఈఓ అబ్దుల్ కరీం, ఏపీవో నాగజ్యోతి, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల సుస్థిర అభివృద్ధే ధ్యేయం



శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ తులసమ్మ, అధికారులు

చాగలమర్రి: గ్రామాల సుస్థిర అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని, అందుకే స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, స్టేట్ అబ్జర్వర్ వెంకటరత్నం, సర్పంచ్ తులసమ్మ అన్నారు. గురువారం చాగలమర్రిలోని ఎంపీపీ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన ఎల్ఎస్‌డీజీఎస్ శిక్షణా కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశీలకుడు వెంకటరత్నం హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. 2023లో ఐక్యరాజ్య సమితి గ్రామాల్లో దారిద్ర్య రేఖకు దిగువన ప్రజలు ఉండకూడదని, పేదరికాన్ని నిర్మూలించి సుస్థిర అభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో 17 అంశాలతో కూడిన ప్రణాళికను ప్రకటించిందన్నారు. ఆరోగ్యం, విద్య, వైద్యం, బాలలు, మహిళల సంక్షేమం, తాగునీటి సౌకర్యం, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర 9 అంశా లతో కూడిన ప్రణాళికను గ్రామాల్లో అభివృద్ధి పరిచేందుకు శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. మాస్టర్ ట్రైనర్లు ఈఓపీఆర్డీ తాహీర్ హుసేన్, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య, విద్యుత్ ఏఈ షాజహాన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ, వైద్యాధికారి ఇమ్రాన్, హెచ్ఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గొడవలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు



గ్రామసభలో మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజినాయక్

పాములపాడు: అనవసర విషయాలకు గొడవలు పడి జీవితాలు నాశనంచేసుకోవద్దని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ హెచ్చరించారు. గురువారం రాత్రి మండలంలోని మిట్టకందాల గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్య ఏదైనా ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. మత్తు పదార్థాలు, గంజాయి వాడకం మూలంగా ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నట్లు తెలిస్తే పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పిల్లలు సెల్ ఫోన్ వాడకం ఎక్కువైందని, తల్లి దండ్రులు జాగ్రత్తలు పాటించాలన్నారు. సమావేశంలో ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్‌రెడ్డి, ఎస్ఐ సురేష్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణపై వినతులు అందజేయండి

నంద్యాల(అర్బన్): ఎస్సీ ఉప వర్గీకరణపై విచారణ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను నియమించిందని, జిల్లాలోని ఎస్సీ సంఘం నాయకులు, ప్రతినిధులు ఫిర్యాదులు, వినతులు ఇచ్చేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ సాధికార అధికారిణి చింతామణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏదైనా సంతకంతో కూడిన రాతపూర్వక మెమొరాండం, రెప్రజంటేషన్లను వచ్చే ఏడాది జనవరి 9వ తేదీ వరకు కార్యాలయ పని వేళల్లో సమర్పించాలని పేర్కొన్నారు.